నష్టపోయిన ప్రతి రైతు పేరు జాబితాలో ఉండాలి

కాళ్ళ, సెప్టెంబరు 13 : భారీ వర్షాల కారణంగా నష్టపోయిన ప్రతీ వరి రైతు పేరు నష్టపరిహారం జాబితాలో ఉండాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. కాళ్ళలో భారీ వర్షాలకు నీట మునిగి పాడైపోయిన వరి పంట పొలాలను శుక్రవారం పరిశీలించారు. పొలాల్లోని గట్లపైకి వెళ్లి కుళ్లిన వరి దుబ్బలను చూసి, రైతులతో మాట్లాడారు. నష్టపోయిన ప్రతీ రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని, ఎవరూ అధైర్యపడవద్దని భరోసా కల్పించారు. అనంతరం మండలంలో ఎన్ని ఎకరాలలో పంట నష్టం జరిగిందో వ్యవసాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన ఏ ఒక్క రైతు పేరు జాబితాలో లేకున్నా, అర్హత లేని రైతు పేరు జాబితాలో ఉన్నా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పంట నష్టపోయిన వారు తమ పేర్లు ఉన్నాయో లేవో చూసుకోవాలని, లేని వారు వెంటనే నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, ఆకివీడు ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో జయవాసుకి, వ్యవసాయ, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



నీటమునిగిన పంట పొలాలు చూడడానికి కాలువపై ఉన్న తాటిపట్లపై నడుస్తున్న కలెక్టర్ నాగరాణి

3,480 హెక్టార్లలో వరికి నష్టం

భీమవరం రూరల్, సెప్టెంబరు 13 : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆరు వేల 150 మంది రైతులు సాగు చేసిన 3480 హెక్టార్లలోని వరి పొలాలు ముంపునకు గురైనట్టు వ్యవసాయ శాఖ గుర్తించింది. వీరిలో మూడు వేల మంది కౌలు రైతులు. పెనుమంట్ర, ఇరగవరం, పెనుగొండ, తణుకు మండలాల్లో సాగుకు వర్షప్రభావం అంతగాలేదు.



టీడీపీలో చేరుతున్న వైసీపీ కార్పొరేటర్లు, చిత్రంలో ఎమ్మెల్యే చంటి, నగర మేయర్ నూర్జహాన్

టీడీపీలోకి మరో ఐదుగురు

ఏలూరు కార్పొరేషన్‌లో ఖాళీ అవుతున్న వైసీపీ

ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 13: ఏలూరు కార్పొరేషన్ పాలక మండలిలో వైసీపీ ఖాళీ అవుతోంది. కొన్ని రోజుల క్రితం 20 మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీలో చేరగా శుక్రవారం ఎమ్మెల్యే బడేటి చంటి సమక్షంలో మరో ఐదుగురు టీడీపీలో చేరారు. ఏలూరు కార్పొరేషన్‌లో 50 మందిలో 47 మంది వైసీపీ కార్పొరేటర్లు. వీరిలో ఇప్పటి వరకు 27 మంది టీడీపీ గూటికి చేరారు. మిగిలిన వారు టీడీపీ వైపు చూస్తున్నారు. భవిష్యత్తులో అదే జరిగితే పాలక మండలిలో వైసీపీ ఖాళీ అయ్యే అవకాశాలున్నాయి. తాజాగా ఎమ్మెల్యే సమక్షంలో చేరిన వారిలో 8, 14, 23, 42, 43వ డివిజన్ల కార్పొరేటర్లు ప్రవీణ్ కుమార్, దారపు అనూష, జె.సాంబశివరావు, సత్యవతి, జె.కనక రాజేశ్వరి ఉన్నారు. ఇప్పటికే ఈ ఐదుగురు వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తూ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావుకు రాజీనామా పత్రం పంపారు. కార్యక్రమంలో నగర మేయర్ షేక్ నూర్జహాన్, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కో ఆప్షన్ సభ్యులు పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

వసుధ ఫౌండేషన్ కోటి విరాళం



పాలకోడేరు, సెప్టెంబరు 13 : గరగపర్రుకు చెందిన వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు వరద బాధితుల సహాయ నిధికి కోటి రూపాయల చెక్కును విజయవాడ క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబుకు అందించారు.



ఎస్ఆర్‌కేఆర్ విరాళం రూ.25 లక్షలు

భీమవరం ఎడ్యుకేషన్ : భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యం, సిబ్బంది తరపున వరద బాధితుల సహాయార్థం రూ.25 లక్షల చెక్కును కళాశాల అధ్యక్షులు సాగి ప్రసాదరాజు, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ, కళాశాల గవర్నింగ్ బాడీ మెంబర్ సాగి సత్య ప్రతీకవర్మ సీఎం చంద్రబాబును కలిసి అందజేశారు.



అమ్మా నాన్నలకు ఎంత కష్టం !

భీమవరం క్రైం, సెప్టెంబరు 13 : పాపం.. ఆ అమ్మ, నాన్నలకు ఎంత కష్టం వచ్చి పడిందో..! తాము ఉంటున్న ఇంటి స్థలాన్ని కొడుకు అమ్మేయడంతో తాము ఇప్పుడు ఎక్కడకు వెళ్లాలో అర్థం కావడం లేదని వాపోతున్నారు.. వృద్ధ దంపతులు భీమవరం నాచువారి సెంటర్‌కు చెందిన డొకల నాగన్న, అప్పాయమ్మలు. వారి మాటల్లోనే.. మాకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సెంటున్నర స్థలాన్ని నమ్మకంతో కొంత కాలం క్రితం చిన్న కుమారుడికి రాసిచ్చాం. ఆ స్థలంలోనే గుడిసె వేసుకుని జీవిస్తున్నాం. కొంత కాలం క్రితం ఈ స్థలాన్ని కుమారుడు వేరే మహిళకు విక్రయించాడు. గుడిసెను పీకేసి స్థలాన్ని అప్పగించే ప్రయత్నం చేశాడు. స్థలాన్ని కొనుగోలు చేసిన మహిళ ప్రహరీ నిర్మాణం చేపట్టారు. దీనిపై వృద్ధ దంపతుల ఆవేదన అంతా ఇంతా కాదు. తమకు పించనే ఆధారమని, ఇప్పుడు ఉన్న గూడు లేకుండా చేస్తే తమకు దిక్కెవరని కన్నీటిపర్యంతమయ్యారు. మూడు రోజులుగా నీడ లేక ఎండలోనే స్థలం వద్దే ఉన్నారు. వీరిని చూసి స్థానికులు పాపం ఎంత కష్టమొచ్చిందోనని వాపోయారు. దీనిపై అధికారులు స్పందించి వీరికి న్యాయం చేయాలని కోరుతున్నారు.

చిన్న గోపురంలో పవిత్రోత్సవాలు

పాలకొల్లు అర్బన్ : అష్టభుజ లక్ష్మీనారాయణస్వామి ఆలయం(చిన్న గోపురంలో) శుక్రవారం రాత్రి స్వామి వారి పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.



భూముల విలువ పెంపు లేనట్లే

అధికారుల పెంపు ప్రతిపాదనలకు కూటమి ప్రభుత్వం నో

- రియల్ జోష్ పెంచేందుకు నిర్ణయం
- వైసీపీ ప్రభుత్వ తప్పిదాలకు మరమ్మతులు

రిజిస్ట్రేషన్‌లో భూముల మార్కెట్ విలువను పెంచేందుకు ఉన్నతాధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆదేశాలు జారీచేశారు. ఆ దిశగా జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలన్నీ కసరత్తు చేశాయి. పట్టణ కేంద్రాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు గరిష్టంగా 15 శాతం ధరలను పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. కాని ప్రభుత్వం అందుకు సుముఖత చూపడం లేదు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధి చెందుతుందన్న అంచనాతో ధరలు పెంచడానికి అధికారులు సమాయత్తమయ్యారు. వాస్తవానికి అమరావతి, విశాఖపట్నం ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయి. ఇతరచోట్ల అంతగా ధరలు ఊపందుకోలేదు. కానీ రియల్టర్లలో జోష్ నెలకొంది. గతంలో వైసీపీ హయాంలో పెండింగ్‌లో పెట్టిన ప్రాజెక్టులన్నీ తిరిగి ప్రారంభిస్తున్నారు. మార్కెట్ భూములు ధరలు పెంచినంత మాత్రాన ప్రభుత్వానికి ఆదాయం వచ్చే అవకాశం లేదని, రిజిస్ట్రేషన్ శాఖలో క్షేత్రస్థాయి సిబ్బంది అంచనాలు వేసుకుంటున్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో భూములు ధరలు పెంచినా ఆదాయం పెరగని విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు. వైసీపీ హయాంలో రెండు పర్యాయాలు ధరలను పెంచారు. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం పెరగలేదు. రిజిస్ట్రేషన్‌లు తగ్గిపోయాయి. బహిరంగ మార్కెట్‌లో భూముల ధరలు తగ్గుముఖం పట్టాయి. అమ్ముకుందామన్నా కొనేవారు కరువయ్యారు. రిజిస్ట్రేషన్ శాఖలో లక్ష్యాన్ని చేరుకోవడం కూడా కష్టతరమైంది. ప్రభుత్వం సమీక్షలు నిర్వహించినా ఫలితం లేకపోయింది. జిల్లాలో 60 శాతం మించి ఆదాయం సమకూరలేదు.

వైసీపీ హయాంలో భీమవరం పశ్చిమ గోదావరి జిల్లా కేంద్రమైంది. ఒకేసారి అక్కడ 20 శాతం ధరలు పెంచేశారు. ఎన్నికల ముందు మరో పర్యాయం ధరలు పెంచేందుకు నిర్ణయం తీసుకున్నారు. అయినా సరే రిజిస్ట్రేషన్ శాఖ ఆశించిన విధంగా ఆదాయం చేకూరలేదు. భూముల క్రయ విక్రయాలకు సంబంధించి రిజిస్ట్రేషన్‌లు అత్యంత స్వల్పంగానే జరిగాయి. భీమవరం కేంద్రంగా గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే వారంతా హైదరాబాద్‌లోనే స్థిరపడ్డారు. దీంతో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాతే ఇటువంటి ధోరణి ఎక్కువైంది. భీమవరంలో నిర్మాణ రంగం పూర్తిగా స్థంభించింది. దాని ఫలితంగా భీమవరంలో ఉన్న రెండు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు 60 శాతం మించి ఆదాయం రాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత పరిస్థితులు అంత ఆశాజనకంగా కనపించడం లేదు. భవిష్యత్‌లో భీమవరంతోపాటు జిల్లాలోని అన్ని పట్టణాల పరిధిలోనూ నిర్మాణ రంగం రియల్ ఎస్టేట్ వ్యాపారాల్లో వృద్ధి చెందుతాయన్న అంచనాతో ఉన్నారు. అయినా సరే భీమవరంలో భూములు రిజిస్ట్రేషన్ విలువ పెంపు కోసం అధికారులు ఆసక్తి చూపలేదు. పెంపునకు ప్రతిపాదనలు సిద్ధం చేయలేదు. తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లు తదితర సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలోనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అయినా ప్రభుత్వం నుంచి సానుకూలత లేకపోవడంతో ప్రతిపాదనల దశలోనే అంతా మిన్నకుండిపోయారు.

• లక్ష్యాల్లో వెనుకంజ

జిల్లాలో ఈ ఏడాది రూ.676 కోట్ల ఆదాయాన్ని సాధించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. ఇప్పటి వరకు నెల వారీ లక్ష్యాలలో 60 శాతం కూడా చేరుకోలేకపోయారు. ఆగస్టు మాసాంతానికి జిల్లాలో రూ.255.95 కోట్ల ఆదాయం రావాలి. కాని, రూ.149.53 కోట్లు అంటే 58 శాతం మాత్రమే ఆదాయం సమకూరింది. ఈ పరిస్థితుల్లో రిజిస్ట్రేషన్ ధరలను పెంచితే పెద్దగా ఫలితం ఉండదని క్షేత్రస్థాయి సిబ్బంది అంచనా వేస్తున్నారు. భూముల క్రయ విక్రయాలు జరిగేలా మార్కెట్ పెంచనప్పుడే రిజిస్ట్రేషన్‌లు అత్యధికంగా జరుగుతాయి. దస్తావేజులు నమోదవుతాయి. ఆదాయం పెరుగుతుంది. అది నెరవేరాలంటే అభివృద్ధి జరగాలి. మౌలిక వసతులు కల్పించాలి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ దిశగా అడుగులు వేస్తోంది. పల్లెలు, పట్టణాల్లో మౌలిక వసతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. జిల్లాకు ప్రధాన ఆధార మైన ఆక్వా, వరి, వాణిజ్య పంటల విస్తరణకు, అభివృద్ధికి ప్రణాళికలు రచిస్తున్నారు. అదే ఇప్పుడు రిజిస్ట్రేషన్ శాఖలో ఆశలు రేకిస్తున్నాయి.

వీధి వ్యాపారులకు బ్యాంకు రుణాలు

- పీఎంస్వానిధి కింద ఒక్కొక్కరికి పది వేలు.. సకాలంలో చెల్లిస్తే 20 వేలు
- జిల్లాలో 4,545 మందికి రూ.4.54 కోట్లు ఇవ్వాలని లక్ష్యం
- అర్హులను గుర్తించేందుకు సర్వే



భీమవరం టౌన్, సెప్టెంబరు 13 : పట్టణాల్లోని వీధి వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్రం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి స్ట్రీట్‌వెండర్స్ ఆత్మ నిర్భర్ నిధి కింద బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తున్నారు. కొత్తగా వీధి వ్యాపారులను గుర్తించి, వారికి బ్యాంకు రుణాలు మంజూరు చేసేందుకు మెప్మా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మునిసిపాల్టీల్లో సర్వే చేస్తున్నారు. కొత్త వ్యాపారులను గుర్తించేందుకు ప్రత్యేకంగా టార్గెట్‌ఇచ్చారు. జిల్లా మొత్తం మీద నాలుగు వేల 545 మందిని గుర్తించి వారికి రుణాలు మంజూరు చేసేలా ఆదేశాలు జారీ చేశారు. గతంలో సర్వే చేసినపుడు జిల్లా మొత్తం మీద పది వేల 55 మంది వ్యాపారులను గుర్తించి వారికి రుణాలు మంజూరు చేయించారు. వీరికి పది వేల చొప్పున పది కోట్ల 55 లక్షలను రుణాలు ఇప్పించారు. ఇప్పుడు కొత్తగా నాలుగు వేల 545 మందిని గుర్తించి పది వేల చొప్పున నాలుగు కోట్ల 54 లక్షల 50 వేల రూపాయల రుణాలు మంజూరు చేయించాలి. భీమవరంలో 1,557 మంది, నరసాపురం 1159, పాలకొల్లు 1783, తాడేపల్లిగూడెం 2054, తణుకులో 1816 మందిని గుర్తించాలని లక్ష్యాలు నిర్దేశించారు. సర్వేలో వ్యాపారులను గుర్తించిన వెంటనే బ్యాంకు రుణాల మంజూరుకు సిఫార్సు చేస్తున్నారు. గతంలో ఈ పథకం కింద రుణాలు పొందిన వ్యాపారులకు ఇచ్చిన రుణం సకాలంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చెల్లిస్తే వారికి తిరిగి 20 వేల రుణం వెంటనే మంజూరవుతుంది. రుణం మంజూరుకు ఎలాంటి దరఖాస్తు చేసుకోవలసిన అవసరం ఉండదు. ఈ రుణం కూడా సకాలంలో చెల్లిస్తే వెంటనే 50 వేల రుణం మంజూరవుతుందని అధికారులు చెబుతున్నారు. వీధి వ్యాపారులు ఆర్థికంగా బలోపేతం కావడమే ఈ పథకం ఉద్దేశమని చెబుతున్నారు.

ఎక్సైజ్ శాఖకు సెబ్ సిబ్బంది మార్పు

నరసాపురం, సెప్టెంబరు 13: గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్)ను కూటమి ప్రభుత్వం రద్దు చేసింది. ఇప్పటి వరకు సెబ్‌లో పనిచేసిన సిబ్బంది ఎక్సైజ్ శాఖలోకి రానున్నారు. ఐదేళ్లుగా జిల్లాలోని ఆరు సెబ్‌స్టేషన్లు త్వరలో ఎక్సైజ్ స్టేషన్లు కానున్నాయి. ఈ స్టేషన్లలో పనిచేస్తున్న 105 మంది సిబ్బంది ఎక్సైజ్ పరిధిలోకి రానున్నారు. దీనిపై ప్రభుత్వం త్వరలో కొత్త ఉత్తర్వులు జారీ చేయనుంది. 2021 మేలో అప్పటి వైసీపీ ప్రభుత్వం సెబ్‌ను ఏర్పాటు చేసి ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న 105 సిబ్బందిని కేటాయించింది. ఈ ప్రకారం జిల్లాలో నరసాపురం, పాలకొల్లు, ఆకివీడు, తణుకు, తాడేపల్లిగూడెం, భీమవరం, ఏలూరు మొత్తం ఆరు స్టేషన్లు ఏర్పాటయ్యాయి. వీరిలో సీఐలు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం దీనిని రద్దు చేయడంతో మళ్లీ పూర్వపు శాఖ ఎక్సైజ్‌లోకి రానున్నారు.

ఆగని దోపిడీ

- ఐదు యూనిట్ల ఇసుక ధర రూ.5,400.. వినియోగదారుడికి రూ.20 వేలు పైనే
- లారీకి రూ.3 వేలు మామూళ్లు
- బుకింగ్‌లో స్థానికులకే ప్రాధాన్యం

7

రూ.1.74 కోట్ల విడుదల

కంపోస్టు యార్డు సమస్యకు పరిష్కారం

ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

నరసాపురం, సెప్టెంబరు 13 : పట్టణ శివారు మంగళగుంటపాలెం వద్ద కంపోస్టుయార్డుకు ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన భూమికి అవసరమైన సొమ్ము రూ.1.74 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ సమస్యపై ఈ నెల 10న ఆంధ్రజ్యోతిలో 'మిగిలింది 20 రోజులే గడువు' అంటూ కథనాన్ని ప్రచురించింది. నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం రైతుల నుంచి నాలుగు ఎకరాలు కొనుగోలు చేసింది. ఆర్థిక సంఘం నిధులు రూ.1.71 కోట్లు పురపాలక సంఘం వద్ద ఉన్నాయి. ఇవి కాకుండా రూ.1.74 కోట్లు రైతులకు ఇవ్వాలి. గత ప్రభుత్వం రైతులకు సొమ్ము ఇవ్వకుండా కాలయాపన చేసింది. ఒప్పందం ప్రకారం ఈ నెలాఖరులోపు రైతులకు సొమ్ము చెల్లించాలి. లేని పక్షంలో కొత్తగా పెరిగే రిజిస్ట్రేషన్ విలువ ప్రకారం రైతులకు అదనంగా కోటి చెల్లించాలంటూ కథనంలో పేర్కొంది. దీనికి స్పందించిన ప్రభుత్వం నాలుగేళ్లుగా పెండింగ్ పెట్టిన ఈ మొత్తాన్ని విడుదల చేసింది. దీనిపై ఎమ్మెల్యే నాయకర్ మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే కంపోస్టుయార్డు సమస్యను పరిష్కరించామని చెప్పారు. శుక్రవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో అంబరీష్‌తో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం రైతులకు పరిహారం ఇవ్వకుండా వేధింపులకు గురిచేసిన విషయాన్ని సీఎం, డిప్యూటీ సీఎంలతోపాటు పురపాలక మంత్రి దృష్టికి తీసుకెళ్లే నిధుల విడుదల చేయించామన్నారు. త్వరలో గోదావరి ఒడ్డున్న కంపోస్టుయార్డును అక్కడికి తరలిస్తామన్నారు. ఆ గ్రామస్థులకు ఇబ్బందులకు లేకుండా చుట్టూ గోడ నిర్మించి వేసే చెత్తను ఎప్పటికప్పుడు రీసైకిల్ చేయిస్తామన్నారు. సమావేశంలో కమిషనర్ అంజయ్య పాల్గొన్నారు.



నరసాపురం ఎమ్మెల్యే నాయకర్, ఆర్డీవో అంబరీష్



రామాయగూడెం కొల్లేరు వరద నీటిలో ఉండటంతో విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. దీనిని గుర్తించిన కూటమి నాయకులు ఉదయం, సాయంత్రం వేళల్లో వారి కోసం ప్రత్యేకంగా ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. దీనిపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిలకడగా ఉప్పుటేరు

ఆకివీడు రూరల్, సెప్టెంబరు 13 : కొల్లేరు తీర ప్రాంతాల ప్రజలను వారం రోజులుగా కంటి మీద కునుకు లేకుండా చేసిన ఉప్పుటేరు నీటిమట్టం నిలకడగా ఉంది. కొల్లేరులో వరద నీరు నెమ్మదించడంతో ఉప్పుటేరు రైల్వే వంతెన వద్ద నీటిమట్టం 2.58 మీటర్లుగా నమోదైంది. ఎండలు కాస్తుండటం, వర్షాలు లేకపోవడంతో వరద నెమ్మదించింది. రెండు రోజులపాటు పరిస్థితి ఇలానే ఉంటే సాధారణ పరిస్థితికి వచ్చే అవకాశం వుంది.

పెరిగిన ఆటో చార్జీలు

ఆకివీడు-కళింగపాలెం మధ్య ఆటో ప్రయాణానికి ఒకరికి రూ.30 చార్జ్ వసూలు చేసేవారు. ఆకివీడు-చినిమిల్లిపాడు రహదారి నీట మునగడంతో రవాణా వాహనాలు ఆగిపోయాయి. దీంతో ఆటోలు కోళ్లపర్రు మీదుగా ఆకివీడు వెళుతున్నాయి. దీంతో ఒకరికి రూ.50 తీసుకుంటున్నారు. దూరం పెరిగిందని, కోళ్ళపర్రు వంతెన వద్ద నీటిలో వెళ్లాల్సి వస్తోందని, ఆటోలో ఐదుగురినే తీసుకెళ్ళడంతో ఈ చార్జ్ తప్పడం లేదని యూనియన్ నాయకులు చెబుతున్నారు. చినిమిల్లిపాడు వెళ్లాల్సి వస్తే రహదారి బాగా లేకపోవడంతో ఒకరికి రూ.70 తీసుకుంటున్నారు.



కనకాయలంక కాజ్‌వే వద్ద పడవలపై గ్రామస్థుల ప్రయాణం

గోదావరి తగ్గుముఖం

ఆచంట/యలమంచిలి, సెప్టెంబరు 13: రెండు రోజులుగా ఉగ్రరూపం దాల్చిన గోదావరి శుక్రవారం శాంతించింది. నీట మునిగిన లంక గ్రామాలు తేరుకుంటున్నాయి. పెదమల్లం మాచేనమ్మ ఆలయం వరద నుంచి బయటపడింది. అయితే ఉధృతి తగ్గుతున్నప్పటికి వరద ప్రవాహం కొనసాగుతోంది. యలమంచిలి మండలం కనకాయలంక, పెదలంక గ్రామాలు ముంపు నుంచి బయటపడ్డాయి. కనకాయలంక కాజ్‌వే మాత్రం ముంపులోనే ఉండడంతో పడవలపైనే రాకపోకలు సాగుతున్నాయి. శనివారం సాయంత్రానికి ముంపు నుంచి బయటపడే అవకాశం ఉంది. వరద నీరు తగ్గడంతో లంక గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.



వారతిప్పలో ఉధృతంగా ప్రవహిస్తున్న గొంతేరు డ్రెయిన్

పొంగుతున్న డ్రెయిన్‌లు

మొగల్తూరు, సెప్టెంబరు 13 : భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపు నీరంతా తీర ప్రాంతమైన మొగల్తూరు మండలంలోని డ్రెయిన్‌లలోకి రావడంతో ఇవన్నీ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. విజయవాడలోని బుడమేరు, ఎగువ ప్రాంతాల్లోని వాగులు, వంకలు పొంగి పొర్లడంతో ఆ నీరు గొంతేరు, బొంతేరు, వెస్ట్ కుక్కులేరు, ఈస్ట్ కుక్కులేరు, గునిపూడి సౌత్, దర్బరేవు డ్రెయిన్‌ల ద్వారా పేరుపాలెం సముద్ర ముఖం మీదుగా బంగాళాఖాతంలో కలుస్తోంది. దర్బరేవు డ్రెయిన్ పొంగడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ చేలల్లో ముంపు నీరు లాగే పరిస్థితి కనిపించడం లేదు. మురుగు డ్రెయిన్ పొంగి పొర్లుతుండటంతో ముత్యాలపల్లి, వారతిప్ప, చింతరేవు, వారతిప్ప, శేరేపాలెం, కొత్తపాలెం గ్రామాల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రామచంద్రమ్మ ఇకలేరు

ఇంటితో సహా కోట్లాది రూపాయల ఆస్తిని దెందులూరు గ్రామాభివృద్ధికి ఇచ్చేసిన మహాదాత..



దెందులూరు, సెప్టెంబరు 13 : కోట్ల రూపాయల విలువైన ఆస్తులను, ఇంటితో సహా తన జన్మభూమి దెందులూరు గ్రామాభివృద్ధికి దానం చేసిన మహాదాత, నేటి తరానికి స్ఫూర్తి ప్రదాత మెటపర్తి రామచంద్రమ్మ(90) అనారోగ్యంతో హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆమె అంత్యక్రియలు శనివారం అక్కడే జరగనున్నాయి. ఆమె మృతితో గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి. 1934లో దెందులూరులో కొల్లిపర్ర కాశీ విశ్వనాథం, వరలక్ష్మమ్మలకు ఆమె జన్మించారు. అమెరికాలో బిజినెస్ అడ్మిషన్‌లో గ్రాడ్యుయేషన్ చేసి ముంబై, హైదరాబాద్ సిండికేట్ బ్యాంక్‌లో డైరెక్టర్‌గా, రీజనల్ ఆఫీసర్‌గా పనిచేశారు. తన గ్రామానికే చెందిన మెటపర్తి వెంకట సుబ్బారావుతో వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు వెంకట్ ఉన్నారు. భర్త 2018లో మృతి చెందారు. ఆమె తను పుట్టిన ఊరికి ఏదైనా చేయాలని భావించి దెందులూరులో తహసీల్దార్, ఎంపీడీవో, ఆసుపత్రి, పోలీస్ స్టేషన్‌తోపాటు అనేక ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కల్యాణ మండపాలు, దేవాలయాలను స్థలాలతోపాటు భవనాలను నిర్మించారు. వంద మందికి ఇళ్ల స్థలాలు అందించారు. దెందులూరు మండలంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా రూ.100 కోట్ల విలువైన ఆస్తులను రామచంద్రమ్మ దానం చేశారు.



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

భీమవరంలో ఇంటర్నేషనల్ చదరంగం పోటీలు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 13: చదరంగ క్రీడ ద్వారా విద్యార్థుల్లో మేథాశక్తి పెరుగుతుందని చదువుతో పాటు క్రీడాల్లో పాల్గొనాలని భీమవరం ఎమ్మెల్యే పు లపర్తి రామాంజనేయులు అన్నారు. జిల్లా చదరంగం అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో కృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో శుక్రవారం ఇంటర్నేషనల్ చెస్ క్రీడాకారుడు మల్లిఖార్జునరావుతో మొదటి ఎత్తు వేసి ఎమ్మెల్యే అంతర్జాతీయ చదరంగం పోటీలను ప్రారంభించారు. పోటీలలో 25 రాష్ట్రాల నుంచి సుమారు 400 మంది పైగా క్రీడాకారులు పాల్గొనున్నారు. అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ రూ. 5 లక్షలు నగదు బహుమతులు అందిస్తున్నామన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు,అసోసియేషన్ సభ్యులు తోట హరిబాబు, శివరామరాజు, మైలాపురి మురళి, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ నిట్ విద్యార్థులు

ఏపీ నిట్‌లో స్వచ్ఛతా పక్వాడ

తాడేపల్లిగూడెం అర్బన్, సెప్టెంబరు 13 : నిట్‌లో శుక్రవారం ఫిజికల్ ఎడ్యుకేషన్ క్లబ్, ప్రయత్నం క్లబ్, టాస్క్‌ఫోర్స్ క్లబ్, బృందావనం క్లబ్ సంయుక్తంగా స్వచ్ఛతా పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. నిట్ ఇంచార్జి డైరెక్టర్ డాక్టర్ బీఎస్ మూర్తి ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాంగణంలోని అకడమిక్ భవనాలు, క్యాంటీన్, ఇండోర్ స్టేడియం, నిట్ ముఖద్వారం పరిసరాలలోని ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తా చెదారాన్ని విద్యార్థులు తొలగించి శుభ్రం చేశారు. తొలుత పరిపాలనా భవనం నుంచి నిట్ తూర్పు ముఖ ద్వారం వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని, కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సాస్ అసిస్టెంట్‌లు డాక్టర్ శ్రీనివాస్, సంధ్యారాణి, క్లబ్ కార్యదర్శులు బీ.తరుణ్, జగదీష్, మల్లికార్జున్, ఎం.సాయి, శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అరకువ్యాలీ స్పోర్ట్స్ స్కూలో సీట్ల భర్తీకి ఆహ్వానం

బుట్టాయగూడెం, సెప్టెంబరు 13 : 2024-25 విద్యా సంవత్సరానికి అల్లూరి సీతా రామరాజు జిల్లా అరకువ్యాలీ స్పోర్ట్స్ స్కూల్లో (బాలురు) ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం ఈనెల 17న కెఆర్ పురం గిరిజన సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఎంపిక జరుగుతుందని ఆసక్తిగల విద్యార్థులు హాజరు కావాలని ప్రిన్సిపాల్ జి.వెంకయ్య తెలిపారు. 5వ తరగతిలో 30, 7లో 2, 8లో 2, 9వ తరగతిలో 3 సీట్లు ఖాళీగా ఉన్నాయని పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన గురుకుల బాలుర పాఠశాలల విద్యార్థులు కెఆర్ పురంలో జరిగే సెలక్షన్స్‌లో పాల్గొంటారని, ఈనెల 23న అరకువెల్లిలో స్టేట్ సెలక్షన్స్ జరుగుతా యని మెరిట్ విద్యార్థులకు సీట్లు కేటాయిస్తామన్నారు. ఆశ్రమ, మండల పరి షత్ పాఠశాలల్లో చదువుచున్న విద్యార్థులు మాత్రమే అర్హులని తెలిపారు.

నేడు ఏలూరులో మెగా జాబ్ మేళా

ఏలూరు రూరల్, సెప్టెంబరు 13: ఏలూరు గిరిజన భవన్‌లో శనివారం 11 కంపెనీల భాగస్వామ్యంతో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్న ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంటెక్, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ పూర్తిచేసిన వారు ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.





రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ టోర్నమెంట్‌కు ఎంపికైన జట్లు ఇవే

ఏలూరు అర్బన్, సెప్టెంబరు 13 : అక్టోబరు, నవంబరు నెలల్లో జరుగనున్న అండర్-19 స్కూల్ గేమ్స్ (ఎస్జీఎఫ్) బాలికల రాష్ట్రస్థాయి టోర్నమెంట్ బాస్కెట్ బాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జట్ల ఎంపికలు శుక్రవారం ఏలూరు సెయింట్ థెరిస్సా బాలికల జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో జరిగాయి. ఎస్జీఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ జయరాజు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 10 ప్రభుత్వ ప్రైవేటు జూని యర్ కళాశాలల నుంచి క్రీడా ఎంపికలకు 150 మంది బాలికలు హాజర య్యారని, ఉత్తమ క్రీడా ప్రతిభను కనబరిచినవారిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయి ఎస్జీఎఫ్ పోటీలకు జిల్లా తరపున ప్రాతినిధ్యం వహించడానికి పంపిస్తామన్నారు. గతేడాది అండర్-19 విభాగం పోటీల్లో ఉమ్మడి జిల్లాకు నాల్గవస్థానం లభించిందని, పలు క్రీడాంశాల్లో జిల్లా బాలికలు జాతయ స్థాయి పోటీలకు వెళ్ళారని, ఈ ఏడాది కూడా మంచి క్రీడా పటిమ కనబరచాలని సూచించారు. మిగతా క్రీడా విభాగాల్లో ఎంపికలు ఈనెల 16 వరకు కొనసాగు తాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఫాతిమా డిగేల్, ఫిజికల్ డైరెక్టర్ ఆండాళ్ళు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన ఉమ్మడి జిల్లా జట్లు ఇవే

కబడ్డీ జట్టుకు కె.స్వాతి సత్యశ్రీ, బి.కిరణ్మయి, టి.నాగవర్షిణి, బి.దీపిక, పి.తేజశ్వి, ఎం.చరణ్య, టి.సంజన, కె.రుషిత, ఎం.పావని, ఎం.తేజస్విని, బి.పల్లవి, కె.వసంత, కె.రోజాదీపిక, ఎం.కీర్తి, బి.ప్రసన్న, జి.మోహన విజయదుర్గ, బాల్ బ్యాడ్మింటన్ జట్టుకు బి.మోక్షిత, పి.వి.కె.కిరణ్మయి, టి.మౌనిక, ఎం.జిమ్మి, ఈశ్వరీ లతాకుమారి, ఎస్‌కె.ఫహీదా, ఎం.దుర్గాదేవి, కె.హైమశ్రీ, డి.మానస, ఎం.అమూల్య, జి.అనూష, బి.భవాని, బాస్కెట్‌బాల్‌కు పి.జయశ్రీ, కె.రోషిణిదేవి, బి.దేవిశ్రీ, డి.సాయి భవాని, ఎన్.రేణుకాదేవి, డి.మేఘన, బి.సురేఖ, ఎస్.మోహన గాయత్రి, డి.దేవీ ప్రసన్న, ఎస్.హస్సిక, ఎస్.కృష్ణవేణి, కె.పూర్ణిమజ్యోతిశ్రీ, ఎస్.భారతీ జయలక్ష్మి, డి.మౌనిక, జి.జాన్‌జోషిత, కె.సిరిప్రియ,హ్యాండ్‌బాల్ జట్టుకు కె.జానేశ్వరి, కె.జ్యోత్స్న, ఎం.దైవ కృపానిధి, డి.మౌనిక, ఎం.ఎస్.సుప్రియ, జి.జాహ్నవీదేవి, డి.దేవీప్రసన్న, ఎస్.గీతా శ్రావణి, వై.లైట్‌క్వీన్ చౌదరి, ఏ.ఏసురాణి, జి.జాన్ ఇన్షిత, ఆర్.నవ్య, వి.మోక్షిత, ఎం.దుర్గాదేవి, ఎన్.శరణ్య, పి.మహేశ్వరి, జ్యోత్స్నవి, అపర్ణ, నందిని ఎంపికయ్యారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఎన్‌సీసీ ఎన్‌రోల్‌మెంట్



నూజివీడు టౌన్, సెప్టెంబరు 13: నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాం పస్‌లో శుక్రవారం ఆంధ్రా బెటాలియన్- విజ యవాడ ఆధ్వర్యంలో పీయూసీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఎన్‌సీసీ ఎన్‌రోల్ మెంట్‌ను నిర్వహించారు. విద్యార్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించి ఏవో మేజర్ స్వాతీ పాండే, ఎస్ఎం రాజ్‌పాల్, జీసీఐ ఊర్మిళ ఎన్‌సీసీ క్యాడెట్స్‌ను ఎంపిక చేశారు. ఆర్జీయూకేటీ నూజివీడు ఏఎస్‌వో కెప్టెన్ సుబ్బలక్ష్మి, ఇన్‌చార్జి డైరెక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

నిలకడగా నిమ్మ

రైతుల్లో ఆనందం

కిలో రూ.50 నుంచి రూ.70



మార్కెట్‌లో నిమ్మకాయలను బస్తాల లోకి నింపుతున్న హమాలీలు

పెదవేగి, సెప్టెంబరు 13 : నిమ్మ ధర రైతుల ఆశలకు అనుగుణంగా నిలకడగా కొనసాగుతోంది. ఏడు నెలలుగా కిలో రూ.50 నుంచి రూ.100 మధ్య నిలకడగా ఉంది. దీంతో రైతులు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఏటికేడాది నిమ్మకాయలకు గిట్టుబాటు ధరలేక అల్లాడుతుండగా ఏడు నెలలుగా ధర నిలకడకగా ఉండడం ఆర్థిక వెసులుబాటుకు దోహదపడిందని రైతులు పేర్కొంటున్నారు. గతంలో ధర పెరిగినా వారం పది రోజుల వరకే ఉండేది. కానీ ఇప్పుడు ఏడు నెలలుగా ధర నిలకడగా ఉండడం ఊహించని పరిణామని రైతులు చెప్తున్నారు. దిగుబడి తగ్గడం వల్ల డిమాండ్ పెరిగిందని ఈ కారణంగానే నిమ్మకాయల ధర పెరిగిందని చాలామంది అప్పుల ఊబి నుంచి బయట పడ్డారని రైతులు చెబుతున్నారు. బయట రిటైల్ మార్కెట్‌లో కాయ ఒకటి నాలుగు నుంచి ఐదు రూపాయలకు విక్రయిస్తున్నారు.

పడిపోయిన దిగుబడి

నిమ్మకాయలు దక్షిణాది నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు ఎక్కువగా ఎగుమతి అవుతుంటాయి. సెప్టెంబరు నెలలో దెందులూరు మార్కెట్ యార్డు నుంచి సాధారణంగా రెండులారీల సరుకు వెళ్ళేది. అలాంటిది ఇప్పుడు ఒక్క లారీ సరుకు కూడా రావడం లేదు. దిగుబడి గణనీయంగా తగ్గడంతో సరుకులేక ధర పెరిగింది. ఈ ఏడాది అధికంగా పడిన వర్షాలతో నిమ్మ పూత, కాత లేకపోయింది. పూతలేక దిగుబడి తగ్గి మార్కెట్‌కు కాయలు రాక తగ్గిపోయింది. ధర పెరగడానికి ఇది కూడా ఒక కారణంగా కనిపిస్తోంది.

ఎప్పుడూ ఇలా లేదు



ఉత్తరాది రాష్ట్రాల్లో నిమ్మకాయల వాడకం కూడా ఎక్కువగా ఉంది. దీంతో ఏడు నెలలుగా ధర నిలకడగా ఉంది. నిమ్మకాయల చరిత్రలో ఎప్పుడూ కూడా ఇన్నినెలలు నిలకడగా ఉన్న దాఖలాలు లేవు. గట్టిగా రెండు, మూడు వారాలు ధర గరిష్ఠంగా ఉండేది. ఆ సమయంలో కాయలు ఉన్న వారు దాదాపుగా 25 నుంచి 30 శాతం మంది రైతులే లాభాలను అందుకునే వారు. ఈసారి ప్రతి రైతు కూడా గరిష్ట ధరను అందుకున్నారు.

- ఆలపాటి రంగారావు, దెందులూరు మార్కెట్ యార్డు వర్తక సంఘం అధ్యక్షుడు,

పెరిగిన ఎగుమతులు



దిగుబడి తగింది. దీంతో డిమాండ్ పెరగడంతో మంచి ధర లభిస్తోంది.ఇది నిమ్మ తోటల మనుగడకు శుభసూచకంగా చెప్పవచ్చు. దాదాపు ఏడు నెలలుగా కిలో రూ.50 నుంచి రూ.100 లకుపైగా ధర లభించడం రైతుకు లాభదాయకం. చాలామంది రైతులు కొంతమేర నష్టాల నుంచి బయట పడ్డారు. కొంతమంది రైతులు ధర లేనప్పుడు చెట్లను కొట్టివేయడం, ధర ఉన్నప్పుడు మొక్కలు నాటడం చేస్తున్నారు.సాగులో ఒడిదుడుకులు సహజం. అన్నింటిని తట్టుకుని నిలబడితే ఎప్పటికైనా సాగులో లాభమే ఉంటుంది..

- తాతా యశ్వంత్ రాజశేఖర్, వర్తక సంఘం పాలకవర్గసభ్యుడు, పెదవేగి

ఉపాధిహామీ పథకం అమలు చేయాలి



ఈ ఏడాది నిమ్మ కాయల దిగుబడి తగ్గింది. తక్కువ దిగుబడి వచ్చినా ధర బాగుండడంతో ఆశించిన ఆదాయం వచ్చింది. కానీ పెట్టుబడి మాత్రం పెరిగిపోయింది. ఎరువులు, పురుగు మందులు, కూలీల ఖర్చులు పెరిగి పోయాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కూడా ఎరువులు, పురుగు మందులను రాయితీపై అందిస్తే రైతుకు మరింత మేలు జరుగుతుంది. దీంతో పాటు ప్రభుత్వం మారింది. కాబట్టి రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఉపాధి హామీ పథకంలో కూలీలు రైతుల పొలాల్లో పనిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అదే జరిగితే రైతుకు మరింత లాభదాయకంగా ఉంటుంది..

- మారగాని ప్రసాద్, రైతు, లక్ష్మీపురం

ఆగని ఇసుక దోపిడీ





పందలపర్రు ఆర్బీకే వద్ద బారులు తీరిన కొనుగోలుదారులు

ఐదు యూనిట్ల ధర రూ. 5,400

వినియోగదారుడికి మాత్రం..రూ.20 వేలు పైనే

లారీకి రూ.3 వేలు మామూళ్లు

పందలపర్రు, పెండ్యాల స్టాక్ పాయింట్లలో దందా

బుకింగ్‌లలో స్థానికులకే ప్రాధాన్యం

పాలకొల్లు, సెప్టెంబరు 13 : ఉచిత ఇసుక విధానం అబాసుపాలవుతోంది. ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. వినియోగదారుడికి ఇసుక చేరేసరికి ధర తడిసి మోపెడతువుతోంది.స్టాక్ పాయింట్‌లలో 20 టన్నులు (5 యూనిట్లు) ఇసుక ధర రూ.5,400లకు రశీదు ఇస్తుండగా అక్కడ రశీదులు కొట్టించే మధ్య దళారీలు రూ.3 వేలు తీసుకుంటున్నారని లారీ యజమానులు చెబు తున్నారు. జిల్లాలో ఆయా ప్రాంతాలను బట్టి లారీ ఇసుక రూ. 20 వేల నుంచి 22 వేలకు అమ్ముతున్నారు.వాస్తవానికి కిరాయితో కలిపి 5 యూనిట్లు రూ.10 వేల లోపే వినియోగదారునికి చేరాలి. కానీ రెట్టింపు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు.

ఆన్‌లైన్ బుకింగ్ అమలు చేయాలి

పందలపర్రు పెండ్యాల స్టాక్ పాయింట్‌లలో వర్షాల కారణంగా నాలుగు రోజులు ఇసుక ఎగుమతులు నిలిపివేశారు. గురువారం తిరిగి ప్రారంభ మయ్యాయి. ఇక్కడ రైతు భరోసా కేంద్రాల వద్ద ఇసుక బుక్ చేసుకోవడం ప్రహసనంగా మారిందని లారీ యజమానులు వాపోతున్నారు.స్టాక్ పాయిం ట్‌ల వద్ద స్థానికులకే ప్రాధాన్యం ఇస్తూ దూర ప్రాంతాల లారీలకు ఇసుక బుకింగ్ ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. టీడీపీ, జనసేనకు చెందిన వ్యక్తు లంటూ కొందరు దాదాగిరి చేస్తున్నట్లు తెలుస్తున్నది. వరదలు, వర్షాల కార ణంగా నిర్మాణాలు నాలుగింట మూడొంతులు నిలిచిపోయాయి. ఉన్న కొద్ది పాటి నిర్మాణాలకు ఇసుక సురఫరా చేయడానికి లారీలు బారులు తీరుతు న్నప్పటికి స్టాక్ పాయింట్‌ల వద్ద టీడీపీ, జనసేన కూటమికి చెందిన లారీ లకే చలానాలు ఇస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వచ్చే వారంలో ఇసుక బుకింగ్ ఆన్‌లైన్ చేస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. విని యోగదారులు తమ తగ్గరలో ఉన్న మీసేవ కేంద్రాల్లో ఇసుక బుక్ చేసుకుని సంబంధిత స్టాక్‌పాయింట్‌లు, ర్యాంప్‌లలో ఇసుక తెచ్చుకునే విధానం అమ లులోకి తెస్తామని అధికారులు ప్రకటించారు.అయితే మూడు నెలలుగా వివిధ రూపాల్లో ఇసుక దందా కొనసాగుతూనే ఉంది. జగన్‌రెడ్డి పాలనలో వేల కోట్ల రూపాయలు ఇసుకను అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు చేస్తున్న పరిస్థితిల్లో కూటమి ప్రభుత్వంలోనూ అదేవిధానం కొన సాగడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.తక్షణం ఇసుక బుకింగ్ ఆన్‌లైన్ చేసి ఆయా స్టాక్ పాయింట్‌లు, ర్యాంప్‌లలో నిఘా ఏర్పాటు చేయా లని జియో ట్యాగింగ్ విధానం అమలు చేసి ఇసుక నేరుగా వినియోగదారు నికి చేరుతుందా ? లేదంటే అక్రమ అమ్మకాలు జరుగుతున్నాయా అనే ఇషయాన్ని పరిశీలించాలని కోరుతున్నారు.

అధికారులూ..దృష్టి పెట్టండి

ఒక వైపు వరదలు, మరో వైపు భారీ వర్షాలు కురుస్తున్నటికి ఇసుకాసు రులు రెచ్చిపోతూనే ఉన్నారు.ఇపుడున్న విధానం కొనసాగితే రానున్న రోజుల్లో ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందని పలువురు కూటమి నేతలు అభిప్రాయపడుతున్నారు.మొత్తంగా ఇసుక ధరలు కొనుగోలుదారు లకు కంటిలో నలుసుగా మారగా ప్రస్తుత ఇసుక అమ్మకం విధానాలు ప్రభుత్వానికి తల పోటుగా మారింది. ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించి పెండ్యాల పందలపర్రు స్టాక్ పాయింట్ల వద్ద అదనంగా వసూలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లారీ యజమానులు కోరుతున్నారు. స్టాక్ పాయింట్‌ల వద్ద రెండు మూడురోజులు వెయిటింగ్ చేయాల్సి రావడం, అదనంగా రూ. 3 వేలు మామూళ్లు ఇస్తుండటంతో కిరాయి కాస్త పెరుగుతుందని తామేమీ అన్యాయంగా వసూలు చేయడం లేదని లారీ యజమానులు చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమలో టిప్పర్ లారీలు సుమారు 1000 ఉండగా ఇసుక కిరాయిలు కేవలం 100 లారీలకే దక్కుతున్నాయని పలువురు లారీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు ఇసుక అమ్మకాల్లో అక్రమ వసూళ్లపై చర్యలు తీసుకోవాలని వినియోగదారులు, లారీ యజమానులు కోరుతున్నారు.

క్రైం కార్నర్..

వీఆర్వోపై దాడి.. కేసు నమోదు

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 13 : రెవెన్యూకు చెందిన స్థలం ఆక్ర మించుకున్న వ్యక్తిని ప్రశ్నించిన వీఆర్‌వోపై దాడిచేసిన సంఘటన గురు వారం సాయంత్రం తిల్లపూడిలో జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తిల్లపూడి గ్రామానికి చెందిన పోరంబోకు భూమిలో జొన్నల సత్యనారాయణ గతంలోనే ఇంటిని నిర్మించుకుని, దాని పక్కన ఉన్న స్థలాన్ని పశువుల పాకగా ఏర్పాటు చేసుకున్నాడు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ దుర్గాకిషోర్ ఆదేశాలతో విచారణకు వచ్చిన ఇన్‌చార్జ్ వీఆర్‌వో చవాకుల ఆదినారాయణపై కత్తితో దాడి చేశాడు . చేతిపైనా, భుజంపైనా గాయాలవడంతో చికిత్స నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తహసీల్దార్ దుర్గాకిషోర్‌పై కూడా నిందితుడు దురుసుగా ప్రవర్తించడంతో తహసిల్దార్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు రూరల్ రైటర్ మూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

ఉంగుటూరు,సెప్టెంబరు 13 : ఉంగుటూరు బస్టాండులో ఈ నెల 3వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో మోటారు సైకిల్ ఢీకొనగా తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు కారెం వెంకమ్మ(60) రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం నాడు మృతి చెందింది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసిన చేబ్రోలు పోలీసులు శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

డ్రైవర్‌కు గాయాలు.. 45 మంది ప్రయాణికులు సురక్షితం



రోడ్డుపక్కన కూర్చున్న ప్రయాణికులు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 13 : ముందు వెళ్తున్న లారీని అతి వేగంగా వెనుక నుంచి వస్తున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొట్టిన ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి.డీ ఎంఆర్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ఈనెల 12వ తేదీ అర్ధరాత్రి కాకినాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నది. ఆ బస్సులో 45 మంది ప్రయాణికులు ఉన్నారు. అర్ధరాత్రి దాటాకా ఆ బస్సు ఏలూరు సమీపంలోని మెయిన్ బైపాస్ దుగ్గిరాల బ్రిడ్జి వద్దకు వచ్చేటప్పటికి ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. బస్సు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. ప్రమాద సమాచారం అందుకున్న రోడ్డు సేఫ్టీ మొబైల్ సిబ్బంది ఎఎస్ఐ మూర్తి, హోం గార్డు రమేష్ హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని ప్రయాణికులందరిని కిందకు దింపి వేరే బస్సులో విజయవాడ పంపించారు. గాయాలపాలైన డ్రైవర్‌ను ఏలూరు ప్రభుత్వా సుపత్రికి తరలించారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం..బాలిక కిడ్నాప్

ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు

ద్వారకాతిరుమల, సెప్టెంబరు 13: బాలిక కిడ్నాప్ కేసును పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం పెంచుకుని మైనర్ బాలికను ప్రేమ పేరుతో మోసగించి పొరుగు రాష్ట్రానికి తీసుకెళ్లిన వ్యక్తిని, అతని తల్లితండ్రులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ సుధీర్ తెలిపారు. మండలం లోని కోడిగూడెంకు చెందిన ఓ మైనర్‌కు తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన గండికోట దశరథ్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యింది. ఆ బాలికను ప్రేమిస్తున్నానని పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఈనెల 11న ఉదయం దశరథ్ అతని తల్లితండ్రులు ఎల్లయ్యతల్లి లక్ష్మి, బాబాయి అశోక్, బావలు దండ్ల రాము, వల్లపు సురేష్‌లు కారులో వచ్చి తీసుకెళ్లారు. దీనిపై కేసు నమోదు కాగా పోలీసులు సవాలుగా తీసుకున్నారు. ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు భీమడోలు సీఐ జోసఫ్ విల్సన్ పర్యవేక్షణలో ఎస్ఐ సుధీర్ సిబ్బందితో కలసి బాలిక ఆచూకీ తెలుసుకుని ఆమెను తీసుకొచ్చారు. దశరథ్ అతని తల్లితండ్రులను అరెస్ట్ చేసి కిడ్నాప్‌కు వినియోగించిన కారును సీజ్ చేశారు. మిగిలిన ముగ్గురుని అరెస్టు చేస్తామని ఎస్ఐ చెప్పారు.

పాఠశాలలో శానిటరీ సామగ్రి మాయం

లింగపాలెం, సెప్టెంబరు 13: పాఠశాలలోని శానిటరీ సామాగ్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఫిర్యాదు అందినట్లు ఎస్ఐ వెంకన్న తెలి పారు. లింగపాలెం మండలం కలరాయనిగూడెం ప్రాథమికోన్నత పాఠ శాలలో నాడు-నేడు పనుల్లో భాగంగా చేస్తున్న అభివృద్ధి పనులకు సంబం దించి పాఠశాలలో ఉన్న సింకులు, వాటర్‌ట్యాప్‌లు, శానిటరీ మెటీరి యల్‌ను దొంగిలించినట్లు పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు ఫిర్యాదు చేసినట్లు తెలి పారు.దొంగిలించిన వాటి విలువ సుమారు రూ.10 వేలకు పైగా ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడికి గాయాలు

ఏలూరు క్రైం, సెప్టెంబరు 13 : గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయా ణిస్తున్న ఒక వ్యక్తి శుక్రవారం ప్రమాదవశాత్తు భోగీ నుంచి జారి పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి విశాఖ పట్టణం వెళ్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో అనకాపల్లి జిల్లా కోట ఉరట్ల మండలం కె.వెంకటాపురం గ్రామానికి చెందిన రాము నాయుడు (37) ప్రయాణిస్తున్నాడు. భోగీ రద్దీగా ఉండడం వల్ల డోర్ వద్ద నిలబడి ఉన్నాడు. ఏలూరు సమీపంలో ప్రమాద వశాత్తు అతను జారిపడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు.

కబేళాకు తరలిస్తున్న గోవులు స్వాధీనం

నూజివీడు టౌన్, సెప్టెంబరు 13: కబేళాకు తరలిస్తున్న గోవులను నూజివీడు రూరల్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నూజివీడు మండల తుక్కులూరు గ్రామంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పత్రాలు లేకుండా హైదరాబాద్ లోని కబేళాకు తరలిస్తున్న 27 గోవులను స్వాధీనం చేసుకొని గో సంరక్షణ కేంద్రానికి తరలించినట్లు తెలిపారు.

ఒకటే రుణం.. రెండుసార్లు రికవరీ

బ్యాంకు అధికారుల తీరుపై రైతు సంఘం నాయకుల మండిపాటు

కుక్కునూరు, సెప్టెంబర్టు 13: ఒకసారి తీసుకున్న రుణానికి రెండు సార్లు రికవరీ చేసిన బ్యాంకు అధికారులు తీరును ఏపీ రైతు సంఘం జిల్లా నాయకులు వెంకటాచారి తీవ్రంగా ఆక్షేపణ వ్యక్తం చేశారు. శుక్రవారం ఇబ్రహీంపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. పోల వరం నిర్వాసితులకు ఒకసారి తీసుకున్న రుణాన్ని రెండుసార్లు రికవరీ చేసి రైతుల నడ్డి విరిచారని బ్యాంకు అధికారుల తీరుపై మండిపడ్డారు. 2017లో భూసేకరణ చేసి రైతులకు నష్టపరిహారం చెల్లించారని అన్నారు. వేలేరుపాడు మండలంలోని రైతులు పరిహారం ఇవ్వకముందు బూర్గం పాడులోని ఒక బ్యాంకు బ్రాంచ్‌లో పంట రుణాలు తీసు కున్నారు. భూ సేకరణ పరిహారం రైతులకు అందేలోపు బ్యాంకు అధికారులు తాము ఇచ్చిన రుణాలు రికవరీ కోసం కోర్టు నుంచి అనుమతి పొందారని దీంతో రైతులకు తెలియకుండానే రైతులకు వచ్చే పరిహారాన్ని రుణాలు రికవరీ చేసుకున్నారన్నారు. రికవరీ పోను మిగతా డబ్బుల కోసం బ్యాంకుకు వెళ్తే మరలా రికవరీ చేసుకుని రైతులను నష్టపరిచారని తెలిపారు. దీనిపై వెంటనే విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోదావరి వరదలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నల్లజర్ల కృష్ణయ్య, నల్లజర్ల సూర్యం, వెల్లంకి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.





సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న ఆరిమిల్లి సోదరుడు వివేక్.. వైటీ రాజా కుమారుడు అవినాష్

సీఎం సహాయ నిధికి విరాళాలు

తణుకు, సెప్టెంబరు 13 : విజయవాడ వరద బాధితులకు ఎమ్మెల్యే ఆరి మిల్లి రాధాకృష్ణ సోదరుడు, సిరి సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆరిమిల్లి వివేక్ సీఎం చంద్రబాబుకు రూ.10 లక్షలు శుక్రవారం అమరావతిలో అందజేశారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే, దివంగత వైటీ రాజా కుమారుడు అవినాష్ రూ.20 లక్షలు చెక్కు అందజేశారు.



స్వామివారికి పవిత్రాలను తీసుకు వెళ్తున్న అర్చకులు

మద్ది ఆంజనేయుని క్షేత్రంలో పవిత్రోత్సవాలు

జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు 13: మండలంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి పవిత్రోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్ర వారం వేకువ జాము నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, అగ్నిప్రతిష్ట, వాస్తుహోమం, సూత్ర గ్రహణం, పోషణ, వాస్తుహోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి నట్లు ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. పవిత్రాలను వేద పండితులు, ఆలయ ఈవో శిరస్సుపై పెట్టుకుని స్వామిసన్నిధికి తీసుకువెళ్లారు.



భీమవరంలో చెవి, ముక్కు, గొంతు వైద్యుల సమావేశంలో వైద్యులు

మన ఆరోగ్యం మన చేతుల్లోనే..

రాష్ట్రస్థాయి సమావేశంలో వైద్యులు

భీమవరం క్రైం, సెప్టెంబరు 13 : మనిషి శరీరంలో చెవి, ముక్కు, గొంతు అతి సున్నితమైన భాగాలని, వాటిని జాగ్రత్తగా చూసుకుని సంరక్షించుకోవా లని పలువురు డాక్టర్లు అన్నారు. రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్‌లో రాష్ట్రస్థాయి చెవి, ముక్కు, గొంతు వైద్యుల 42వ వార్షిక సమావేశాన్ని శుక్రవారం నిర్వ హించారు. ముందుగా విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ కెవి విష్ణురాజు, సంఘ అధ్యక్షులు డా.నడింపల్లి శంకర్‌కుమార్ వర్మ, ఆర్గనైజింగ్ సెక్రటరీ గొట్టుముక్కల బలకృష్ణంరాజు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ వైద్యానికి ఎన్నో సరికొత్త మెలుకవలు వచ్చాయని, మెరుగైన వైద్యాన్ని అందించడానికి ఇవి ఎంతో ఉపయరిస్తాయన్నారు. ప్రజలు వ్యాధుల పట్ల అవగాహన అవసరమని, లోపాలను ముందే గమనిస్తే పరి ష్కార మార్గాలు ఎన్నో ఉంటాయన్నారు. వర్షాకాలం వచ్చిందంటే చాలు చాలా మంది వివిధ రకాల వ్యాధులతో బాధపడతుంటారని, ప్రత్యేకంగా ఈ సీజన్‌లో చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన సమస్యలు వస్తుంటాయ న్నారు. అనంతరం జైపూర్, ముంబాయి, కలకత్తా నుంచి పలువురు వైద్యు లు సర్జరీలు మెలుకవలును నేరుగా లైవ్ ద్వారా వివరించారు. పలువురు వైద్యులు పలు సందేహాలను అడిగి తెలుసుకున్నారు. పీజీ విద్యార్థులకు పోస్టర్ ప్రెజెంటేషన్, పేపర్ ప్రెజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో ఆర్గనైజింగ్ ట్రెజరర్ ఏం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ధాన్యం సొమ్ములు ఇప్పించాలని రైతుల ఆందోళన

పోలవరం, సెప్టెంబరు 13 : ఆరుగాలం పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసి సొమ్ములు ఇవ్వకుండా మోసం చేసిన దళారి నుంచి ధాన్యం సొమ్ములు ఇప్పించాలని శుక్రవారం పాతపట్టిసీమ గ్రామానికి చెందిన రైతులు ఆందోళన చేశారు. పట్టిసీమ గ్రామానికి చెందిన 11 మంది రైతులు 2023 సంవత్సరం జనవరి నెలలో పోలవరం గ్రామానికి చెందిన ఒక దళారికి 16 లక్షల రూపాయల విలువ చేసే ధాన్యాన్ని అప్పగించారు. ఏడాదిదాటినా ఒక్కపైసా కూడా చెల్లించకుండా మోసం చేశాడని అధికారుల స్పందించి తమ సొమ్ములు తమకు ఇప్పించాలని కోరారు.రైతులు వీరపరాజు ధర్మరాజు, సిరపారపు వెంకటరమణ, రాంబాబు, శ్రీనివాసరావు ఉన్నారు.

17 నుంచి స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలు

›› కలెక్టర్ చదలవాడ నాగరాణి

భీమవరంటౌన్, సెప్టెంబరు 13 : స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలను ఈ నెల 17 నుంచి అక్టోబరు రెండో తేదీ వరకు విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులతోను, మీకోసం సమావేశ మందిరం నందు పంచాయతీరాజ్, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య శాఖ తదితర అధికారులతో వేర్వేరుగా సమావేశం అయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్‌డీలు, డీఎల్పీలు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈనెల 17న జాతీయ నులిపురుగు నిర్మూలన దినం సందర్భంగా విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రలను అందించాలని సూచించారు. జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డీఆర్‌వో జె.ఉదయ భాస్కరరావు, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, జడ్పీ డిప్యూటీ సీఈవో ఎస్.నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారాల్లో ప్రమాద రహిత చర్యలు తీసుకోవాలి

జిల్లాలోని కర్మాగారాల్లో కట్టుదిట్టమైన ప్రమాద రహిత భద్రత చర్యలను తీసుకోవాలని కలెక్టర్ నాగరాణి సంబంధిత యాజమాన్యాలను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో కర్మాగారాల్లో తీసుకోవాల్సిన ప్రమాద రహిత భద్రత చర్యలపై అధికారులు, పరిశ్రమల యజమానులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 53 పరిశ్రమలలో రెండు పరిశ్రమలు ఎ-కేటగిరి కింద, 51 పరిశ్రమలు బి-కేటగిరి కింద నమోదు చేశామన్నారు.

గ్రామాల అభివృద్ధి గాలికొదిలేసిన వైసీపీ : బొలిశెట్టి

పెంటపాడు, సెప్టెంబరు 13: వైసీపీ చేతకాని పాలనతో గ్రామాల అభివృద్ధిని గాలికొదిలేసిందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ విమర్శించారు. శుక్రవారం మండలంలోని కె.పెంటపాడు, యానాలపల్లి, ఉమామహేశ్వరం గ్రామాల్లో సీసీ రహదారులకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామ సర్పంచ్‌లు పీతల సత్యనారాయణ, గోకా ఛాయాదేవి, మద్దుకూరి నాగేశ్వర రావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ పెంటపాడు, తాడేపల్లిగూడెం రూరల్ మండలాల్లో సీసీ రహదారుల అభివృద్ధికి రూ.6.30 కోట్లకు అనుమతులు వచ్చాయన్నారు. బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, ఎంపీపీ దాసరి హైమవతి, కిలపర్తి వెంకట్రావు, పుల్లా బాబి, దత్తు ప్రసాద్, దాసరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

3ఎఫ్ సేవా కార్యక్రమాలు భేష్..

3-ఎఫ్ స్వాభిమాన్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో జువ్వలపాలెంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఫుడ్ ఫ్యాట్స్ ఫ్యాక్టరీ డైరెక్టర్ ఓపీ గోయెంకాతో కలసి ప్రారంభించారు. అనంతరం ప్రత్తిపాడులో నిర్మించబోతున్న వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. చెరుకూరి జగత్ సోమశేఖర్, పాలూరి వెంకటేశ్వరరావు, ఫుడ్స్, ఫ్యాట్స్ జీఎం జనార్దన్, అసిస్టెంట్ మేనేజర్లు జి.శ్రీనివాసరెడ్డి, ఎ.చిరంజీవి, కో-ఆర్డినేటర్ వేముల శ్రీనివాస్, మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో మహిళలకు ఉపాధి : వీసీ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 13: అరటిలో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ తో మహిళలు ఇంటి వద్దే ఉపాధి పొందవచ్చని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ వీసీ డాక్టర్ కె. గోపాల్ పేర్కొన్నారు. అరటినారతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై నైపుణ్య శిక్షణ ముగింపు సందర్భంగా శుక్రవారం తయారు చేసిన ఉత్పత్తులు గాజులు, చెవిరింగులు తదితర వస్తువులను ప్రదర్శించారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ బి. గోవిందరాజులు, రిజిస్ట్రార్ డాక్టర్ బి. శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు.

కళింగ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడిగా 'ఊట'

తణుకు, సెప్టెంబరు 13: తణుకు పట్టణానికి చెందిన కళింగ సంక్షేమ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఊట గోవిందరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు సీసన వెంకటరమణ నియామక పత్రం అందజేశారు. పలువురు సంఘ పట్టణ నాయకులు ఆయనను అభినందించారు.

సీతారామ్ ఏచూరి మృతి పార్టీకి తీరని లోటు

పాలకొల్లు అర్బన్, జూలై 13 : సిపిఎం పార్టీ ఆల్ ఇండియా కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి తీరని లోటు అని సిపిఎం నేత, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏచూరి చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. సీపీఎం కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, యర్రా అజయ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

ప్రజలందరూ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఆచంట, సెప్టెంబరు 13 :అకాల వర్షాలు, వరదలు కారణంగా సీజనల్‌వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలందరూ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, జడ్పీటీసీ ఉప్పలపాటి సురేష్ బాబు అన్నారు. శుక్రవారం మండల పరిషత్‌సర్వ సభ్య సమావేశం ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి అధ్యక్షతన నిర్వహించారు. వారు మాట్లాడుతూ అధికారులందరూ ప్రజలకు సేవలందించాలని, గ్రామాల్లో శానిటేషన్ పనులు నిరంతరం చేపట్టాలన్నారు. వైస్ ఎంపీపీలు యర్రగొప్పుల నాగరాజు, తాళం శ్రీనివాస్, ఎంపీడీవో పి.నరసింహ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నిరసిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ

నరసాపురం టౌన్, సెప్టెంబరు 13: ఎస్సీ వర్గీకరణ నిలుపుదల చేయాలని మాలల ఐక్య వేదిక ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం అంబేడ్కర్ సెంటర్ నుంచి గాంధీబొమ్మ సెంటర్ వరకు నిరసన ర్యాలీ సాగింది. నాయకులు కెనడి, శరత్, కాకిలేటి ఆనంద్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమన్నారు.

మాంటిస్సోరి విద్యార్థినికి రూ.లక్ష బహుమతి



విద్యార్థినికి రూ.లక్ష బహుమతిని అందిస్తున్న జేసీ రాహుల్‌కుమార్‌రెడ్డి

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 13 : గత ఆగస్టు నెలలో మహాన్యూస్ నిర్వహించిన మేము సైతం జయహో భారత్ పోటీలో ఉల్లంపర్రు మాంటిస్సోరి విద్యార్థిని హిమశ్రీ వర్ష ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో గెలుచుకున్న ప్రథమ బహుమతి లక్ష రూపాయలను శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జేసీ టి. రాహుల్‌కుమార్‌రెడ్డి అందజేశారు. మహాన్యూస్ ప్రతినిధి బి.రంగబాబు మాట్లాడుతూ ఆగస్టు 15 సందర్భంగా నిర్వహించిన పోటీల్లో 12 వేలమంది పాల్గొన్నారన్నారు.

సంక్షిప్త సమాచారం..

- **పాలకోడేరు, సెప్టెంబరు 13:** ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగుల నివారణ మాత్రలను మింగించి నులిపురుగులను నులిమేద్దామని పాలకోడేరు మండల పరిషత్ కార్యాలయంలో సంబంధిత పోస్టర్‌ను ఆవిష్కరణ కార్యక్రమంలో పాలకోడేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వర్ణ నిరంజని అన్నారు.
- **భీమవరం క్రైం :** గర్భిణులు పోషక విలువలున్న ఆహారాన్ని తినాలని శివిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో గర్భిణులకు అందించిన ఉచిత పౌష్టికాహారం కార్యక్రమంలో భీమవరం ఏరియా ప్రభుత్వాసుపత్రి ఇన్‌చార్జీ సూపరిండెంట్ డాక్టర్ మాధవిలత అన్నారు.
- **గణపవరం :** గణపవరంలోని చింతలపాటి మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చదువుతున్న ముగ్గురు పేద విద్యార్థులకు రూ.16,500 పరీక్ష రుసుం తొలి వాయిదా దాతలు బైరబోయిన చైతన్యవర్మ, విఠల్ అందజేశారని ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి తెలిపారు.
- **భీమవరం క్రైం :** భీమవరం టూటౌన్ పరిధిలోని గరగపర్రు రోడ్డులో టాటాఏస్ వాహనం ఢీకొని ఓ వ్యక్తి గాయపడినట్టు ఏఎస్ఐ స్వామి చెప్పారు. ఈనెల 10న ఎన్.సురేష్ తన అన్నకుమారుడు తేజను బైక్‌పై తీసుకు వెళ్ళి టౌన్ రైల్వేస్టేషన్ వద్ద దింపి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగిందని, కేసు నమోదు చేశామని ఏఎస్ఐ తెలిపారు.
- **పెనుగొండ :** పెనుగొండ మండలం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవం పెనుగొండ జూపిటర్ మాస్టర్ మైండ్స్ స్కూలు ఆవరణంలో నిర్వహించారు. ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కార్యవర్గాన్ని అభినందించారు.
- **అత్తిలి :** పోషణ మహోత్సవంలో భాగంగా అత్తిలి జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం విజయలక్ష్మి ఆధ్వర్యంలో అత్తిలి సెక్టార్ సూపర్‌వైజర్ కుమారి విద్యార్థినులకు బాల్యవివాహాల నిషేధ చట్టంపై అవగాహన కల్పించారు.



వలవల బాబ్జికి రూ. 1.50 లక్షల విరాళం అందజేస్తున్న టీడీపీ నాయకులు



దాతల విరాళాల రూ.2 లక్షల డీడీని ఎమ్మెల్యే పితానికి అందిస్తున్న తహసీల్దార్ ఫాజల్



వరద బాధితుల కోసం ఎమ్మెల్యే ఆరిమిల్లికి చెక్కు అందజేసిన వావిలాల సరళాదేవి,తదితరులు



కలెక్టర్‌కు రూ.2 లక్షల చెక్కు అందిస్తున్న అక్కమాంబ టెక్స్‌టైల్స్ జనరల్ మేనేజర్ ఎం.సత్యనారాయణ

వరద బాధితులకు భారీగా విరాళాలు

తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ

తణుకు, సెప్టెంబరు 13: విజయవాడ వరద బాధితుల కోసం ఇప్పటివరకు కోటి 63 లక్షల 77 వేల 261 రూపాయల భారీ మొత్తం చెక్కుల రూపంలో సీఎం రిలీఫ్ ఫండ్‌కు అందాయని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పిలుపు మేరకు నియోజకవర్గంలో తన పిలుపునకు స్పందించి పెద్ద ఎత్తున ఉద్యోగులు, వ్యాపారులు, వాణిజ్య, పారిశ్రామిక వేత్తలు, వైద్యులు, సంస్థలు, సొసైటీలు, ఎన్ఆర్ఐలు ఎంతోమంది స్పందించారని చెప్పారు. ఇంకా చాలా మంది దాతలు చెక్కులు ఇస్తామని చెప్పారన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కలగర వెంకట కృష్ణ, బసవా రామకృష్ణ, ఆనాల ఆదినారాయణ, పితాని మోహన్, వావిలాల సరళాదేవి, గోపిశెట్టి రామకృష్ణ, తాతపూడి మారుతీరావు, చిక్కాల వేణు, కొమ్మిరెడ్డి శ్రీనివాసు, ఒమ్మి రాంబాబు పాల్గొన్నారు.

- తణుకు: వరద బాధితుల కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు టీడీపీ నాయకురాలు వావిలాల సరళాదేవి, కుటుంబ సభ్యులు కలసి రూ. 80 వేల చెక్కును ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. తణుకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సప్పా బలరామ్ రూ. 50 వేలు, మైత్రి క్లబ్ తరపున నాగరాజు రూ. 20 వేలు, కిళ్ళీ, బీడీ వర్తక సంఘం రూ. 50 వేల చెక్కును అందించారు. కడియాల సూర్యనారాయణ, చీకటి శ్రీనివాసు, ఎస్‌పీ సతీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.
- తణుకు: ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సూచనలతో గన్నవరం నియోజకవర్గంలోని కాకులపాడు మండలం రంగయ్య అప్పారావు పేట గ్రామంలో తణుకు పీస్ యూత్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్బదాసరి లాజర్ ఆధ్వర్యంలో 75 మంది వరద బాధిత కుటుంబాలకు పది కేజీల బియ్యం, బ్రెడ్, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించారు. పాతూరులోని లయన్స్ క్లబ్ జోన్ చైర్ పర్సన్ చిట్టూరి సుజాత ఆర్థిక సాయంతో తణుకు స్వర్ణ లయన్స్‌క్లబ్ ద్వారా వరద బాధితులకు దుప్పట్లు, బియ్యం, నిత్యావసరాలు వెళ్ళే వాహనాన్ని ఎమ్మెల్యే ఆరిమిల్లి జెండా ఊపి ప్రారంభించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు బి.శేషారావు, సుంకవల్లి చిరంజీవి కుమారి, బూరుగుపల్లి వెంకట్రావు, అల్లూరి కరుణాకర్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.
- భీమవరంటౌన్, సెప్టెంబరు 13 : వరద బాధితులకు అపన్నహస్తం అందించేందుకు దాతలు ముందుకు వచ్చి కలెక్టర్ నాగరాణికి పలువురు చెక్కులను అందించారు. తణుకులోని అక్కమాంబ టెక్స్‌టైల్స్ జనరల్‌మేనేజర్ ఎం.సత్యనారాయణ రూ.రెండు లక్షలు, నరసాపురం అగ్రికల్చర్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్‌వీ రాజు, డైరెక్టర్లు లక్ష రూపాయల చెక్కును, తణుకులోని లహం ఫుడ్స్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ జనరల్ మేనేజర్ అరవింద్ సరీన్ లక్ష రూపాయల చెక్కును, గుజరాత్ స్టేట్‌పెట్రోల్ కెమికల్ లిమిటెడ్ రూ.20 వేల చెక్కులను అందించారు. దాతలను కలెక్టర్ నాగరాణి అభినందించారు.



ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు విరాళం అందిస్తున్న నాయకులు

- పోడూరు : పోడూరు మండలానికి చెందిన పలువురు దాతలు అందించిన విరాళాలు రూ.2 లక్షలను డీడీ రూపంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు తహసీల్దార్ మహమ్మద్ సయ్యద్ ఫాజల్ అందజేశారు. కొమ్ముచిక్కాలలోని పితాని నివాసానికి వెళ్లి అందించామని తహసీల్దార్ తెలిపారు. డీటీ డి.రాజేష్, ఆర్ఐ కె.రాంబాబు పాల్గొన్నారు.
- ఆచంట : ఆచంట చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం లక్షా వెయ్యి 16 రూపాయలు చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ ద్వారా ఇన్‌చార్జి తహసీల్దార్ సుగుణ సంధ్యకు చెక్కును అందించారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కేతా రామకృష్ణ, గణేశుల సుబ్బారావు, చల్లా శ్రీను, నంబూరి రాజా, నంబూరి అంజిబాబు, కంచెర్ల శివ, వేండ్ర శ్రీను పాల్గొన్నారు.
- గణపవరం: విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి గణపవరంలో సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ఆధ్వర్యంలో విరాళాల సేకరణ నిర్వహించారు. శుక్రవారం గణపవరంలో చిరు వ్యాపారుల ఆర్థిక సహకారంతో రూ.14,125 విరాళాలు వచ్చినట్లు భీమారావు తెలిపారు. కలిశెట్టి వెంకట్రావు, సీతారామ్ ప్రసాద్ పాల్గొన్నారు.
- పెనుగొండ : మా విద్యార్థులు వరద బాధితుల కోసం రూ.4,80,471 సేకరించారని పెనుగొండ భాష్యం ప్రిన్సిపాల్ ఎస్‌వీ అప్పారావు తెలిపారు. శుక్రవారం భాష్యం పాఠశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. అత్యధిక విరాళం సేకరించిన ఎల్‌కేజీ విద్యార్థి మండేలా లోహిత్ రూ.10616 తదిర విద్యార్థులను అభినందించారు. సేకరించిన మొత్తాన్ని యాజమాన్యం ద్వారా సీఎం సహాయ నిధికి అందజేస్తామన్నారు. జోనల్ ఇన్‌చార్జి ఎ.శ్రీమన్నారాయణరెడ్డి, ఇన్‌చార్జి రాణి రోజాజీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం రూరల్ మండలం రామన్నగూడెంకు చెందిన టీడీపీ నాయకులు పార్టీ కార్యాలయం వద్ద రూ. 1.50 లక్షలు, పడమరవిప్పర్రు గ్రామానికి చెందిన నాయకులు రూ. 31,136ను టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జికి అందజేశారు.
- తాడేపల్లిగూడెం అర్బన్ : వరద బాధితుల సహాయం కోసం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌కు శుక్రవారం పలువురు విరాళాలు అందజేశారు. రామన్న గూడెం గ్రామ నాయకులు రూ.1.50 లక్షలు, బొల్ల రమేష్, బొల్లా శ్రీనివాస్ రూ. లక్ష, ప్రత్తిపాడుకు చెందిన ఎస్ఆర్‌వో సత్య విజయ ఫంక్షన్ హాల్ వీర్ల సత్యనారాయణ రూ. 50 వేలు, పెంటపాడుకు చెందిన కొవ్వూరి లక్ష్మణరెడ్డి రూ. 25 వేలు, బోడపాడుకు చెందిన మట్టా సత్యనారాయణ, రాంబరికిల బాలమురళీకృష్ణ మిత్ర బృందంతో కలసి రూ. 50 వేలు, ఉమామహేశ్వరానికి చెందిన కలపల సుధాకర్ రూ. 18 వేలు, ఆరుగొలనుకు చెందిన ఆడపా అప్పలరాజు రూ. 10 వేలు, తాడేపల్లిగూడెం యువరాజ్ బార్ అండ్ రెస్టారెంట్‌కు చెందిన బుద్దాల వెంకట రామారావు రూ. 25 వేలు, తాడేపల్లిగూడెం సుమిత్ర బార్ అండ్ రెస్టారెంట్ పి. శివరామకృష్ణ రూ. 25 వేలు, తాడేపల్లిగూడెం అజయ్ కృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ వి. కార్తీక్ సోమేశ్వరరావు రూ. 25 వేలు, ప్రముఖ వ్యాపారవేత్త నంద్యాల కృష్ణమూర్తి రూ. లక్షను విరాళంగా అందజేశారు.
- అత్తిలి :వరద బాధితుల సహాయార్థం అత్తిలి మానవత శాఖ రూ. 20 వేలను ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణకు అందజేశారు. ఆరిమిల్లి వారిని అభినందించారు. బోడపాటి సూర్యచంద్రరావు, ఆనాల ఆదినారాయణ, కొరిపల్లి హరి, ఆల్తి సత్యనారాయణ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న నరసాపురం అగ్రికల్చర్ కంపెనీ లిమిటెడ్ ఎం.డి. కేఎస్‌వీ రాజు, డైరెక్టర్లు



కలెక్టర్‌కు చెక్కు అందిస్తున్న తణుకులోని లహం ఫుడ్స్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ జీఎం అరవింద్ సరీన్



చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పితాని ద్వారా తహసీల్దార్‌కు చెక్కు అందజేస్తున్న దృశ్యం



విరాళం సేకరించిన విద్యార్థులను అభినందించిన పెనుగొండ భాష్యం యాజమాన్యం

నరసాపురంలో పారిశుధ్యం మెరుగుపర్చాలి



కొవ్వలికి బొకే అందిస్తున్న కమిషనర్ అంజియ్య

నరసాపురం టౌన్, సెప్టెంబరు 13: పట్టణంలో శానిటేషన్ మెరుగు పరిచి, తాగునీటిని సమస్యను పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కొవ్వలి నాయుడు కమిషనర్ అంజియ్యను కోరారు. శుక్రవారం కమిషనర్‌ను మార్యదపూర్వకంగా ఆయన కలిశారు. ఈ సందర్భంగా పట్టణంలోని చాలా వార్డుల్లో కుళాయిల్లో మురికినీరు వస్తుందని, శానిటేషన్ సక్రమంగా నిర్వహించడం లేదని, డ్రెయినేజీల్లో సిల్ట్ తీయడం లేదని తెలిపారు. త్వరలో ఈ సమస్యల్ని పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఆర్ఐ నానాజీ ఉన్నారు.

ఆదికేశవ స్వామి ఆలయ చైర్మన్‌గా కృష్ణారావు బాధ్యతలు

నరసాపురం టౌన్, సెప్టెంబరు 13: పట్టణంలో ప్రసిద్ధిగాంచిన ఆదికేశవ ఎంబర్ మన్నార్‌స్వామి ఆలయ వంశపారం పర్య ధర్మకర్త మండలి చైర్మన్‌గా పుప్పాల వెంకటకృష్ణారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆలయ ఈవో చాగంటి సురేష్‌నాయుడు, ప్రధాన అర్చకులు రామ్మోహన్ సమక్షంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వచ్చేనెల 3 నుంచి 12 వరకు దేవీనవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తామని, తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పారదర్శకంగా పంట నష్టపరిహారం నమోదు చేయాలి

కాళ్ళ, సెప్టెంబరు 13 : భారీ వర్షాల కారణంగా నీట మునిగి నష్టపోయిన పంట నష్టపరిహార జాబితా పారదర్శకంగా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వరరావు అధికారులకు సూచించారు. ఏలూరుపాడు గ్రామంలో ఇటీవల కురిసినటువంటి భారీ వర్షాలకు మునిగిన వరిచేలను స్థానిక వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. మండలంలో మొత్తం 785 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగినట్టు అధికారులు తెలిపారు. వీరిని ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. ఆకివీడు వ్యవసాయ సహాయ సంచాలకులు కేఎస్ఎస్ శ్రీనివాసరావు, ఏవో సి.జయవాసుకి, వీఆర్వోలు సుబ్రహ్మణ్యం, మణికుమార్, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

'ఎస్ఆర్‌కేఆర్'లో ఇంజనీర్స్ డే

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 : మోక్షగుండం విశ్వేశ్వరయ్య, సర్ ఆర్థర్ కాటన్ వంటి ఆదర్శనీయమైన ఇంజనీర్లు ప్రాజెక్టులు నిర్మించి దేశాన్ని అన్నపూర్ణగా తీర్చిదిద్దారని పోలవరం ప్రాజెక్టు హెడ్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె. బాలకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 15వ తేదీన విశ్వేశ్వరయ్య జయంతి పురస్కరించుకుని ఇంజనీర్స్‌డే నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతిరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు మాట్లాడిన అనంతరం కె.బాలకృష్ణమూర్తిని ఘనంగా సత్కరించారు. భీమవరం లోకల్ చాప్టర్ చైర్‌పర్సన్ డాక్టర్ కె.సురేష్‌బాబు, హానరరీ కార్యదర్శి డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి పాల్గొన్నారు.

మెంటే పార్థసారథి పుట్టినరోజు వేడుకలు



పార్థసారథితో పుట్టినరోజు కేక్ కట్ చేయిస్తున్న కూటమి నాయకులు

భీమవరం అర్బన్, సెప్టెంబరు 13 : కార్యకర్తలకు అండగా నిలబడే నాయకుడు మెంటే పార్థసారథి అని భీమవరం ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు, ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావు అన్నారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి పుట్టినరోజును పురస్కరించుకుని వారి స్వగృహం వద్ద శుక్రవారం భీమవరం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి నాయకుల ఆధ్వర్యంలో జన్మదినోత్సవ వేడుకను నిర్వహించి కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. కృష్ణబలిజ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ గంటా త్రిమూర్తులు, అంగర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం మార్కెటు వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ వద్ద జరిగిన వేడుకలలో ఎమ్మెల్యే అంజిబాబు కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమాని ప్రారంభించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు కోళ్ళ నాగేశ్వరరావు, వేండ్ర శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి రామలింగరాజు, మెరగాని నారాయణమ్మ, ఎంపీపీ వీరవల్లి దుర్గభవాని, పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, నాయకులు మద్దుల రాము, వీరవల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మినీ గోకులానికి 250 మంది దరఖాస్తు

నరసాపురం రూరల్, సెప్టెంబరు 13: నరసాపురం, మొగల్తూరు మండలాల్లో మినీ గోకులం యూనిట్‌లకు 250 మంది పాడి రైతులు దరఖాస్తు చేసుకున్నారని పశుసంవర్ధకశాఖ ఏడీఈ డాక్టర్ సుధాకర్ తెలిపారు. ప్రభుత్వం నియోజకవర్గానికి 44 యూనిట్‌లను కేటాయించిందన్నారు. 90శాతం సబ్సిడీపై గోకులంను నిర్మిస్తామన్నారు. వచ్చిన దరఖాస్తుల్ని తనిఖీ చేసి మండల కమిటీకి పంపించామన్నారు. జిల్లా కమిటీ యూనిట్లను మంజూరు చేస్తుందన్నారు.

పంట నష్టంపై సర్వే పూర్తి : ఏవో జాన్సన్

నరసాపురం రూరల్, సెప్టెంబరు 13: ఇటీవల కురిసిన వర్షాలు, వరదల కారణంగా మండలంలో జరిగిన పంట నష్టంపై సర్వే పూర్తి చేశామని ఏవో డాక్టర్ జాన్సన్ తెలిపారు. మండలంలో 1515 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందన్నారు. సుమారు 1008 మంది రైతుల వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాగానే ఒక్కొక్క రైతుకు రూ.6,800 చొప్పున పరిహారం అందిస్తామన్నారు. ప్రస్తుతం మండలంలో 3500 ఎకరాలు మాత్రమే సార్వా జరుగుతుందని ఏవో తెలిపారు.

చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలి : కమిషనర్

భీమవరంటౌన్, సెప్టెంబరు 13 : భీమవరం పట్టణంలో 26వ వార్డు బ్యాంక్ కాలనీలో కమిషనర్ కె.రామచంద్రారెడ్డి తనిఖీ చేశారు. వార్డు పరిధిలో గల చెత్తను ఎప్పటికప్పుడు తీసివేసేలా శానిటేషన్ సిబ్బంది పనిచేయాలని ఆదేశాలు జారీ చేశారు ప్రజలందరూ విరివిరిగా చెత్తను క్లాప్ వెహికల్స్‌కు అందజేసి మున్సిపల్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వినాయక నవరాత్రి పూజలు



విద్యాగణపతికి పండ్లతో అలంకరణ



తణుకు పట్టణంలోని ఏవుళ్లమ్మ పుంతలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి వైభవంగా దీపోత్సవం నిర్వహించారు.

భీమవరంటౌన్/నరసాపురం టౌన్/పాలకొల్లు అర్బన్/భీమవరం అర్బన్/ ఆచంట/మొగల్తూరు :వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శుక్రవారం భీమవరం గునుపూడిలోని విద్యాగణపతికి పలు రకాల పండ్లతో అలంకరణ చేశారు. నరసాపురం పట్టణంలోని 2వార్డు చలవపేటలో గణనాథుడ్ని కూరగాయలతో అలంకరించారు. పాలకొల్లు శ్రీరామనగర్‌లో మహిళాలు విష్ణు, లలితా సహస్ర నామ పారాయణలు, బ్రహ్మశ్రీ చాగంటి లింగరాజు శివతత్వం విశిష్టతపై అనే అంశంపై పురాణ ప్రవచనం గావించారు. భీమవరం పట్టనంలోని 37వ వార్డు రజకుల పేటలో మావుళ్ళమ్మ రజక సంఘం ఆధ్వర్యంలో 15వ వార్షికోత్సవం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కొటికలపూడి గోవిందరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు ప్రారంభించారు. ఆచంట శివారు రెల్లి వీధిలో గణనాధుని నిమజ్జనం వేడుకగా జరిగింది. మొగల్తూరు గ్రామ చావిడి వద్ద చవితి వేడుకల్లో మహిళలు విష్ణు, లలితా సహస్ర నామ పారాయణాలు నిర్వహించారు. మొగల్తూరు లాకు వద్ద గల వినాయకుడు ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు.



నిత్యావసరాలు అందిస్తున్న జనసేన కౌన్సిలర్ సత్యవతి, వాసు బృందం

బాధితులకు అండగా జనసేన నాయకులు

ఆకివీడు, సెప్టెంబరు 13 :బాధితులకు అండగా జనసేన నాయకులు నిలిచారు. ఆకివీడు రెండో వార్డులోని చంద్రబాబునగర్ కాలనీలో సుమారు యాభై కుటుంబాలు నివాసముంటున్నారు. వీటిలో కొన్ని ఇళ్లల్లోకి వరద నీరు చేరుకుంది. ఈనెల 12న ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్తకు గణపవరానికి చెందిన జనసేన నాయకులు ముత్యాల వాసు, టీమ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక జనసేన కౌన్సిలర్ గోపిశెట్టి వెంకట సత్యవతి, చిరంజీవి-పవన్ కల్యాణ్ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు చిరంజీవి సత్యనారాయణ నేతృత్వంలో కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాలు, కూరగాయలు అందించారు.

శ్రీఆంజనేయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

పునరావాసులకు ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలని శ్రీఆంజనేయం చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు జమిందార్ జూపూడి సుబ్బన్న అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సుమారు 300 మంది పునరావాసులకు శుక్రవారం అల్పాహారం, భోజనాలు అందజేశారు. మాజీ సర్పంచ్ గొంట్లా గణపతి, టీడీపీ పట్టణ అధ్యక్ష-కార్యదర్శి బొల్లా వెంకట్రావు, గంధం ఉమా, పోలేటి సుబ్రహ్మణ్యం, రాజు తదితరులు ఉన్నారు.

ఎట్టకేలకు గుంతల పూడ్చివేత

పాలకొల్లు అర్బన్, సెప్టెంబరు 13 : స్థానిక భీమవరం రోడ్డులోగల రైలుగేటు వద్ద పడిన గోతులను శుక్రవారం రైల్వే సిబ్బంది పూడ్చి వేత పనులు చేపట్టారు. ఈనెల 11న ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన 'గేటు దాటాలంటే గుండె గుబేలు' అని వచ్చిన వార్తకు స్పందించిన అధి కారులు శుక్రవారం చర్యలు చేపట్టారు. గుంతలు పూడ్చడంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పశువులను సంరక్షించుకోవాలి : డీడీ

ఆకివీడురూరల్, సెప్టెంబరు 13 : వరద ప్రాంతాలలో పశువులను సంరక్షించుకోవాలని వెటర్నరీ డీడీ జవహర్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం కోళ్ళపర్రులో జరిగిన పశువైద్యశిబిరంలో ఆయన పాల్గొన్నారు. తొలివిడతగా తీవ్ర వరద ప్రభావిత ప్రాంతాలైన చినిమిల్లిపాడు, కళింగగూడెం, సిద్ధాపురం, కోళ్ళపర్రు, సమతానగర్ ప్రాంతాలకు 25 టన్నులు టీఎంఆర్ పశువుల దాణా వచ్చిందని, ప్రస్తుతానికి 1050 పశువులను గుర్తించినట్లుగా తెలిపారు. వెటర్నరీ ఏడీ జనార్దనరావు, పశువైద్యులు తదితరులు పాల్గొన్నారు.